క్లుప్తంగా

22న అక్షర శిల్పి ఆత్రేయ గ్రంథావిష్కరణ

విజయవాడకల్చరల్: ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 22 వ తేదీ సాయంత్రం 6 గంటలకు ప్రముఖ సినీ పరిశోధకుడు పైడిపాల రచించిన ''అక్షర శిల్పి ఆత్రేయ'' గ్రంథావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్ష , కార్యదర్శులు కొల్లూరి, బోడి ఆంజనేయ రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి, విశ్వ హిందీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్, సీనియర్ జర్నలిస్ట్ రెంటాల జయదేవ, యువజన క్రీడల శాఖా మంత్రి మండపల్లి రామ్ ప్రసాద్ రెడ్డి పాల్గొంటారని తెలిపారు.

హిందీ పక్షోత్సవాలు ప్రారంభం



పాయకాపురం(విజయవాడరూరల్): న్యూ రాజీవ్ నగర్‌లోని ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థలో మంగళవారం హిందీ పక్షోత్సవాలను సీనియర్ పరిశోధన అధికారి డాక్టర్ ఏజేవీ సాయిప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీ వరకు పక్షోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. సంస్థ అధికారులకు, సిబ్బందికి వివిధ అంశాలలో హిందీ మాధ్యమంగా కార్యాలయ నోట్‌షీటు రాయడం, డిక్టేషన్, చర్చ, క్విజ్, వ్యాసరచన, కవితలు, పాటలు, అంత్యాక్షరి పోటీలు నిర్వహిస్తామని తెలియజేశారు. ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతులు ప్రదానం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సంస్థ పరిశోధన అధికారి డాక్టర్ సుజాత, సిబ్బంది పాల్గొన్నారు.

పీఎంఏవై 2.0 మార్గదర్శక సూత్రాలు విడుదల

పటమట(విజయవాడతూర్పు): అందరికీ గూడు కల్పించాలనే సంకల్పంతో ప్రారంభించిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై)లో పేదలందరికీ ఇళ్లను సమకూర్చాల్సిన బాధ్యత ఉందని వీఎంసీ అడిషనల్ కమిషనర్(జనరల్) డాక్టర్ ఎ. మహేష్ అన్నారు. ఈ మేరకు మంగళవారం విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, నూతన భవనం సమావేశపు హాల్లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 ఆపరేషన్ గైడ్‌లైన్స్‌ను భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివరించారు. పట్టణాల్లో నివసిస్తున్న ప్రజలందరికీ పక్కా ఇళ్లను కల్పించేందుకు దేశ వ్యాప్తంగా కోటి ఇళ్లను నిర్మిస్తున్నట్లు ప్రధాని పేర్కొన్నారని, దీనికి అధికారులు కృషి చేయాలని అడిషనల్ కమిషనర్ కోరారు. సమావేశంలో ఏపీ టిడ్కో ఎస్ఈ భూక్యా చిన్నోడు, కార్పొరేటర్లు బి.వి.కుమార్, వి.లలిత, అపర్ణ, ఉమ్మడి వెంకటేశ్వరరావు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన లబ్ధిదారులు పాల్గొన్నారు.

గాయకుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలి

విజయవాడ కల్చరల్: గాయనీ గాయకులలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని విశ్రాంత పోలీస్ అధికారి కె.డేవిడ్ రాజు అన్నారు. వుయ్ ఆర్ విత్ యూ సేవా సంస్థ ఆధ్వర్యంలో మచిలీపట్నానికి చెందిన దివ్యాంగ గాయకురాలు దుర్గా జయశ్రీ ఆర్థిక సహాయ వితరణ కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్ కొత్తా పూర్ణానందం కళావేదిక మీద మంగళవారం సినీ సంగీత విభావరి నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు, పరుచూరి విజయలక్ష్మి, ఆదిరాల జయప్రభ పాల్గొన్నారు. సీనియర్ గాయకుడు శ్యాం ప్రసాద్ పర్యవేక్షణలో ఉష, మల్లీశ్వరి, రేష్మ, విజయశ్రీ గుప్తా, మారేపల్లి జోషి, సింధూ, రవితేజా తదితరులు తెలుగు, హిందీ చిత్ర గీతాలను ఆలపించారు. నిర్వాహకులు గాయనీ గాయకులను ఆత్మీయంగా సత్కరించారు. గాయని దుర్గాజయశ్రీకి ఆర్థిక సహాయం అందించారు.

ఫర్నిచర్ పరిశ్రమకు కోట్లాది రూపాయల నష్టం

ఇటీవల సంభవించిన వరదల్లో అంబాపురం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న వందలాది ఫర్నిచర్ వర్క్‌షాపులు వరద నీటిలో మునిగిపోయాయి. దీంతో ఆయా పరిశ్రమల యజమానులకు కోట్లాది రూపాయల నష్టం ఏర్పడింది. వందలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. నగరంలోని ఫర్నిచర్ పరిశ్రమకు కోలుకోలేని దెబ్బ తగిలింది.

-పాయకాపురం(విజయవాడరూరల్)



తడిసిన ఫర్నిచర్‌ను బయటకు తరలిస్తున్న కార్మికులు

అనుమానాలు రేకెత్తిస్తున్న డ్రైన్ల పూడ్చివేత

- బీఆర్టీఎస్ రోడ్డులో సైడు డ్రైన్‌లు పూడ్చి ర్యాంపుల నిర్మాణం
- స్థానిక ప్రజాప్రతినిధి ఆదేశాలతోనే అంటున్న అధికారులు



ప్రస్తుతం పెట్రోలు బంకు ఎదుట డ్రైన్‌ను పూడ్చి ఏర్పాటుచేసిన ర్యాంపు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురం బీఆర్టీఎస్ రోడ్డులోని సైడు డ్రైన్ పూడుకుపోయి మురుగునీటి పారుదల నిలిచిపోయినా పట్టించుకోని నగరపాలకసంస్థ అధికారులు స్థానిక ప్రజాప్రతినిధి ఆదేశాల మేరకు బీఆర్టీఎస్ రోడ్డు, ఫుడ్‌జంక్షన్ సమీపంలోని సైడు డ్రైన్‌లను పూర్తిగా పూడ్చివేసి వాటిపై శాశ్వతంగా కాంక్రీటు, బీటీ రోడ్డు నిర్మాణం చేయడంపై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో గంటల తరబడి రోడ్లపై నీరు నిలవకుండా ఉండేందుకు గతంలో సత్యనారాయణపురం బీఆర్టీఎస్ రోడ్డులో సీతన్నపేట గేటు నుంచి ఫుడ్ జంక్షన్ మీదుగా భగత్‌సింగ్ రోడ్డు, ముత్యాలంపాడు వరకు సైడు డ్రైన్ నిర్మాణం చేపట్టారు. అయితే ఇప్పుడు ఈ సైడు డ్రైన్‌లు కాస్తా ఆక్రమణలకు గురై మురుగునీటి పారుదలకు ఆటంకంగా మారుతున్నాయి. తాజాగా బీఆర్టీఎస్ రోడ్డు, ఫుడ్ జంక్షన్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన పెట్రోలు బంకు నిర్వాహకులు దాని ఎదురుగా ఉన్న డ్రైన్‌ను పూడ్చి కాంక్రీటుతో ర్యాంపు ఏర్పాటుచేసుకున్నారు. దీన్ని అడ్డుకోవాల్సిన నగరపాలకసంస్థ సిబ్బంది, కాంట్రాక్టర్‌లు దగ్గర ఉండి మరీ సైడు డ్రైన్‌లను పూడ్చే పనులు చేపడుతుండటం పలు అనుమానాలకు దారి తీస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై వారిని వివరణ అడగ్గా స్థానిక 28వ డివిజన్ కార్పొరేటర్ ఆదేశాలతోనే డ్రైన్‌లను పూడ్చి, ర్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పడం గమనార్హం. దీనిపై నగరపాలకసంస్థ కమిషనర్ దృష్టి సారించి బీఆర్టీఎస్ రోడ్డులో జరుగుతున్న డ్రైన్‌ల తొలగింపు పనులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



గత నెలలో బంకు ముందు ఉన్న సైడు డ్రైన్ (ఫైల్)

నా దృష్టికి రాలేదు.. విచారించి చర్యలు తీసుకుంటా..

సత్యనారాయణపురంలోని సైడు డ్రైన్‌లను పూడ్చే పనులకు నగరపాలకసంస్థ నుంచి ఎటువంటి అనుమతులు మంజూరు చేయలేదు. బీఆర్టీఎస్ రోడ్డులో డ్రైన్‌లపై సీసీ, బీటీ నిర్మాణాలు చేస్తున్నట్లు నా దృష్టికి వచ్చింది. దీనిపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. ఎక్కడైతే డ్రైన్‌లను పూడ్చి ర్యాంపులు వేశారో వాటిని పగులకొట్టి మురుగు నీటి పారుదలకు చర్యలు చేపడతాం.

– శ్రీనివాస్, ఈఈ, సర్కిల్–2

వరద బాధితులకు అండగా నిలవాలి



వరద ముంపు ప్రాంతాలలో బాధితులకు నగదు, చీర పంపిణీ చేస్తున్న క్రీస్తు సంఘం ప్రతినిధులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వరద బాధితులకు ప్రతి ఒక్కరూ చేతనైన సాయం అందించాలని తాము క్రీస్తు సంఘం ఆధ్వర్యాన తమ వంతు బాధ్యతగా 50 కుటుంబాలకు రూ.5వేలు, చీర పంపిణీ చేస్తున్నట్లు సంఘం పాస్టర్ దేవరపల్లి అశోక్ కుమార్ తెలిపారు. వరద ముంపు ప్రాంతాల్లో ఎంపిక చేసిన నిరుపేద విశ్వాసులకు మంగళవారం ఒక్కొక్క కుటుంబానికి రూ.5 వేల నగదు, చీర పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాడవపేట క్రీస్తు సంఘం సభ్యులు, వెస్ట్ విద్ బైబిల్ స్కూల్ డైరెక్టర్ ఎ.విశ్వేశ్వరరావు, మట్టా వినోద్‌కుమార్ ఆధ్వర్యాన తాము వరద ముంపు ప్రాంతాలలో బాధితులకు ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. ఇప్పటికే పలుమార్లు తాము నిత్యావసర సరుకులు, ఆహార పొట్లాలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మట్టా ప్రభాత్, విశ్వనాథపల్లి ఫత్తేదారు, పిల్లల స్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



పాయకాపురం(విజయవాడరూరల్): ప్రజ్వల ఆర్గనైజేషన్ తరఫున మంగళవారం పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన 785 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, జామెంట్రీ బాక్స్, బ్యాగుతో కలిపిన కిట్లను డీఈఓ యు.వి.సుబ్బారావు చేతుల మీదుగా అందజేశారు.వరదల పిమ్మట తొలిరోజు హైస్కూల్ పునఃప్రారంభించడంతో ఇదేరోజు దాతలు విద్యార్థులకు కిట్లు అందజేయడం అభినందనీయమని అన్నారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ మైనం హుస్సేన్, ఉపాధ్యాయులు, ప్రజ్వల ఆర్గనైజేషన్ సభ్యులు శ్రీకాంత్, నాగరాజు, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

28వ డివిజన్‌లో రూ.9.61 లక్షలతో రోడ్డు మరమ్మతులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలోని 28వ డివిజన్‌లో ఇటీవల వర్షాలు, వరదల వల్ల దెబ్బ తిన్న రోడ్లకు మంగళవారం రూ.9.61 లక్షలతో రోడ్డు మరమ్మతులు చేపట్టారు. రోడ్డు మరమ్మతు పనులను స్థానిక కార్పొరేటర్ వీరమాచనేని లలిత పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా నాణ్యతా ప్రమాణాలతో రోడ్డు పనులు పూర్తిచేయాలని సూచించారు. భానునగర్, లక్ష్మీనగర్, సత్యనారాయణపురం, శ్రీనగర్ కాలనీలో గుంతలు పడిన రోడ్లను సరిచేశారు.

ముంపు బాధితులకు భారత్ వికాస్ పరిషత్ వితరణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): బుడమేరు వరద ప్రభావిత ప్రాంతాలైన విద్యాధరపురం, హౌసింగ్‌బోర్డ్ కాలనీ, అజిత్‌సింగ్‌నగర్, కండ్రిక, వాంబేకాలనీ, రాజీవ్‌నగర్‌లోని బాధితులకు భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం నిత్యావసర వస్తువులు, దోమ తెరలు, దుప్పట్లు వితరణగా అందజేశారు. ఆదామా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సౌజన్యంతో సత్యనారాయణపురంలోని విజ్ఞాన్ విహార్, శిశు విద్యామందిర్ పాఠశాలల్లో పైన పేర్కొన్న ప్రాంతాల్లోని సుమారు వెయ్యి మంది బాధితులకు ఆయా వస్తువులతో కూడిన కిట్లను అందజేశారు. కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ ప్రాంతీయ అధ్యక్షుడు రూప్‌చంద్ జైన్, కార్యదర్శి కమల్ నయన్ బాంగ్, ఆర్థిక కార్యదర్శి ఎంవీఎస్ రామచంద్రరావు, ప్రాంతీయ కార్యదర్శి మురళీధర్, ఆదామా సంస్థ జనరల్ మేనేజర్ హనుమంతరావు, విజయవాడలోని వివిధ శాఖల అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులు పాల్గొన్నారు.

స్వభావంలో, సంస్కారంలో స్వచ్ఛత ఉండాలి

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు

పటమట(విజయవాడతూర్పు): స్వభావంలో, సంస్కారంలో స్వచ్ఛత ఉండాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు అన్నారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అజిత్‌సింగ్‌నగర్‌లోని మాకినేని బసవ పున్నయ్య స్టేడియంలో ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జరిగే స్వచ్ఛతా హి సేవ కార్యక్రమ ప్రారంభోత్సవం జరిగింది. సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రతిరోజు మన ఇంటిని మన పరిసరాలని ఎలా పరిశుభ్రంగా ఉంచుకుంటామో అంతకంటే ఎక్కువ పరిశుభ్రంగా మన విజయవాడని ఉంచాలని అన్నారు. వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ 2014లో స్వచ్ఛభారత్ మిషన్ మొదలుపెట్టాక, ఈ పదేళ్లలో విజయవాడ నగరపాలక సంస్థ 3, 5, 6వ స్థానాలు కైవసం చేసుకుందని, దీనికి నగర ప్రజలందరి సహకారమే కారణమని అన్నారు. అనంతరం స్వచ్ఛ విజయవాడ బ్రాండ్ అంబాసిడర్ డాక్టర్ జి.సమరం మొక్కలు నాటారు. అంతకు ముందు స్వచ్ఛత హి సేవ కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించే ర్యాలీ నిర్వహించారు. అనంతరం 58, 59, 60 వ డివిజన్లలో పరిసరాలన్నీ పరిశుభ్రపరిచారు. కార్యక్రమంలో విజయవాడ నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి, పలువురు అధికారులు, వివిధ కళాశాలల, పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

విజయవాడ రైల్వేడివిజన్‌లో...

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ వ్యాప్తంగా 'స్వచ్ఛత హీ సేవా' పేరుతో పర్యావరణంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. అందులో భాగంగా మంగళవారం విజయవాడ స్టేషన్ క్లాక్ టవర్ వద్ద జరిగిన కార్యక్రమంలో డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ పాల్గొని అధికారులు, సిబ్బందితో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ప్లకార్డులను చేతపట్టుకుని క్లాక్ టవర్ నుంచి 1వ నంబర్ ప్లాట్‌ఫామ్‌లోని గాంధీ వెయిటింగ్ హాల్ వరకు ప్రదర్శన నిర్వహించారు. పార్శిల్ కార్యాలయం వద్ద బ్రాంచ్ అధికారులతో కలసి మొక్కలు నాటి, పరిసరాలను శుభ్రపర్చారు. అనంతరం ప్రయాణికులకు క్లాత్ బ్యాగులను పంపిణీశారు.

పర్యావరణాన్ని కాపాడుదాం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు జాతీయ రహదారులను సుందరీకరించేందుకు నేషనల్ హైవేల సమీపంలో మొక్కలు పెంచే కార్యక్రమాన్ని చేపట్టామని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) విజయవాడ ప్రాంతీయ అధికారి ఆర్‌కే సింగ్ చెప్పారు. విజయవాడ సమీపంలోని చినఅవుటపల్లి దగ్గర మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) నిర్మిస్తున్న చిన అవుటపల్లి–గొల్లపూడి బైపాస్ రోడ్డులో ఎన్‌హెచ్ఏఐ ఆధ్వర్యంలో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ఆర్‌కే సింగ్ హాజరై విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు.

26 నుంచి దసరా సాంస్కృతికోత్సవాలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): దసరా పండుగను పురస్కరించుకుని ఈ నెల 26వ తేదీ నుంచి మూడు రోజుల పాటు దసరా సాంస్కృతికోత్సవాలు నిర్వహిస్తున్నామని ఎం.బి.విజ్ఞాన కేంద్రం బాధ్యులు స్వరూపరాణి, సేఫ్ అధ్యక్షురాలు జి.జోత్స్న తెలిపారు. రాఘవయ్య పార్కు సమీపంలోని ఎం.బి. విజ్ఞాన కేంద్రంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో దసరా సాంస్కృతికోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతీ యువకుల్లో సృజనాత్మకత, సమాజం పట్ల అవగాహన పెంచేందుకు దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. దసరా ఉత్సవాలు చెడు నుంచి మంచి వైపు యువతను తీసుకువెళ్లడానికి ఉపయోగపడేందుకు దోహదపడాలని 'చెడును దునుమాడుదాం–మంచిని పెంచుదాం' అనే థీమ్‌తో ఈవెంట్స్‌ను రూపొందించామన్నారు. ఎం.బి.విజ్ఞాన కేంద్రం, సేఫ్, తరుణీ తరంగాలు, స్నేహాప్తి ఆర్గనైజేషన్, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, జన శిక్షణ సంస్థాన్, భారత మహిళా మండలి, ఇన్నర్ వీల్–దివాస్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 26, 27, 28 తేదీలలో విజయవాడలో దసరా సాంస్కృతికోత్సవాలు జరుగుతాయన్నారు. 26, 27 తేదీల్లో విజ్ఞాన కేంద్రంలో శాస్త్రీయ, జానపద నృత్యాలు, అభ్యుదయ దేశభక్తి గీతాలాపన, లఘు నాటికలు, స్పాట్ స్కిట్స్, వ్యక్తిత్వ పోటీలు, వీధి నాటకం, వక్తృత్వం, వాద ప్రతివాదాలు, 28న ఉదయం 10 గంటలకు సిద్ధార్థ అకాడమీలో కోలాటాలు, ఫ్లాష్ మాబ్ జరుగుతాయని వివరించారు. పెద్ద సంఖ్యలో పాల్గొని దసరా ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. ఆసక్తి కలవారు ఈ నెల 20వ తేదీ లోగా దరఖాస్తులు పంపాలని కోరారు.

రాజనేని ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు పంపిణీ



కండ్రికలో వరద బాధితులకు నిత్యావసర వస్తువులు అందిస్తున్న పరుచూరి ప్రసాద్, ట్రస్ట్ సభ్యులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద ముంపునకు గురై సర్వస్వం కోల్పోయిన వరద బాధితులకు రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. రూ.2 వేల రూపాయలు విలువచేసే నిత్యావసర వస్తువుల కిట్లను కండ్రిక ప్రజలకు అందించారు. స్థానిక నాయకుడు పరుచూరి ప్రసాద్ మాట్లాడుతూ సింగ్‌నగర్‌లోని బుడమేరు వరద ముంపు వైపరీత్యం గురించి సమాచారం ఇచ్చిన వెంటనే రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ వారు గూడూరు నుంచి విజయవాడకు వచ్చి ఇక్కడి బాధితులకు సహాయం చేయడం అభినందనీయమన్నారు. ఇంత విలువైన సరుకుల కిట్లను అందించి ఆ ట్రస్ట్ వారు చేసిన సాయాన్ని కండ్రిక ప్రాంత ప్రజలు ఎల్లప్పుడు గుర్తుంచుకుంటారన్నారు. ఇదే విధంగా దాతలు ముందుకు వచ్చి వరద ముంపులో చిక్కుకుని అల్లాడిపోయిన ప్రతి ఒక్కరికీ సహాయం చేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో పరుచూరి రాము, భాగ్యలక్ష్మి, దిలీప్, రవి, బుద్ధ రాజలింగం, వెంకటేశ్వరరావు, అంజిబాబు, రాజేష్, రాజు, పరస అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వరదల్లో మునిగిన ఆరోగ్య కేంద్రాల పరిశీలన



నీట మునిగి పాడైన యూపీహెచ్‌సీ సామగ్రిని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): బుడమేరు వరదలో మునిగిన నగరంలోని పలు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మంగళవారం ఎన్టీఆర్ జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని పరిశీలించారు. రాజీవ్‌నగర్, ప్రకాష్‌నగర్, శాంతినగర్, కండ్రిక, సింగ్‌నగర్, లంబాడీపేటల్లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వరదలతో సేవలు పూర్తిగా నిలిచిపోవడంతో, మళ్లీ సేవలు ప్రారంభించేలా చేస్తున్న ఏర్పాట్లను ఆమె తిలకించారు. ఆయా యూపీహెచ్‌సీల్లో నీటిలో మునిగి పాడైన సామగ్రి, మందులు, వ్యాధి నిర్ధారణ యంత్రాలను పరిశీలించారు. వరదలతో ఏర్పడిన అపరిశుభ్ర పరిస్థితిని త్వరగా పరిశుభ్రం చేయాలన్నారు. రోగులకు వీలైనంత త్వరగా సేవలు అందించేలా యూపీహెచ్‌సీలను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట డీపీఓ మహేష్, ఆయా కేంద్రాల వైద్యాధికారులు పాల్గొన్నారు.

సచ్చిదానంద శాస్త్రి మృతి హరికథా రంగానికి తీరని లోటు



పద్మశ్రీ వచ్చిన సందర్భంగా కోట సచ్చిదానంద శాస్త్రికి నగరంలో జరిగిన సత్కార సభ(ఫైల్)

విజయవాడ కల్చరల్: ప్రముఖ హరికథా భాగవతార్, పద్మశ్రీ అవార్డు గ్రహీత కోట సచ్చిదానంద శాస్త్రి మృతి హరికథా రంగానికి తీరనిలోటు అని విశ్వమాత చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకుడు నిడుమోలు రమా సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. కేబీఎన్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కప్పగంతు రామకృష్ణ మాట్లాడుతూ పద్మశ్రీ వచ్చిన సందర్భంగా డాక్టర్ దమ్మాలపాటి రామారావు మెమోరియల్ ట్రస్ట్ పక్షాన నగరంలో ఆయనను ఘనంగా సత్కరించిన సంగతిని గుర్తు చేసుకున్నారు.

సాంస్కృతిక సంస్థల సంతాపం

నగరానికి చెందిన వివిధ సాహితీ కళా సంస్థల ప్రతినిధులు, దమ్మాలపాటి చంద్రశేఖర్, చింతకాయల చిట్టిబాబు, శింగంశెట్టి చంద్రశేఖర్, బోడి ఆంజనేయరాజు, అమ్ముల ప్రసాద్, బ్యాంక్ ప్రసాద్, పరుచూరి విజయలక్ష్మి, శింగంశెట్టి చంద్రశేఖర్, కొల్లూరి బీవీఎస్ శర్మ సంతాపం వ్యక్తం చేశారు.

30న మినీ బ్యూటీ ఎక్స్ పో

- హాజరుకానున్న హెయిర్ డిజైనర్స్, బాలీవుడ్‌కు చెందిన మేకప్ ఆర్టిస్టులు
- పోస్టర్ ఆవిష్కరించిన నిర్వాహకులు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): విజయవాడ బందరురోడ్డులోని ఎస్ఎస్ కన్వెన్షన్ హాలులో ఈ నెల 30న మినీ బ్యూటీ ఎక్స్‌పో నిర్వహిస్తున్నామని ఎస్‌బీఎంఎస్ అకాడమీ ప్రతినిధులు మోక్స్, రాఘవరెడ్డి చెప్పారు. బ్యూటీ ఎక్స్‌పోకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం మొగల్రాజపురంలోని ఒక హోటల్‌లో జరిగింది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఎక్స్‌పోలో బాలీవుడ్‌కు చెందిన సెలబ్రిటీల మేకప్ ఆర్టిస్టులతో పాటుగా ప్రముఖ హెయిర్ డిజైనర్ జావిద్ హబీబ్, డాక్టర్ ఆమోద్ పాల్గొంటారని తెలిపారు. ఈనెల 30వ తేదీ ఉదయం 10 నుంచి సాయంత్రం 6:30 గంటల వరకు ఈ ఎక్స్‌పో జరుగుతుందన్నారు. హెయిర్ కట్, హెయిర్ డిజైనింగ్, మేకప్‌లకు సంబంధించిన ఉత్పత్తుల ప్రదర్శన కూడా ఉంటుందన్నారు. ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సూరిబాబు మాట్లాడుతూ బాలీవుడ్ సెలబ్రిటీ హెయిర్ కట్స్ గురించి, ఎస్ఎఫ్ఎక్స్, లోకల్ సెలబ్రిటీస్ మేకప్‌ల గురించి అవగాహన సదస్సులతో పాటుగా ఈ రంగంలోని నిష్ణాతులకు సన్మానం అనంతరం ఫ్యాషన్ షో ఉంటాయని చెప్పారు. మేకప్ ఆర్టిస్టులు జ్యోతి, లిల్లీ, షహనా, ప్రణవి, రజియా, రుక్సానా, ఉదయ, సిరి తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌పేటలో వైభవంగా విశ్వకర్మ జయంతి



విశ్వకర్మ భగవాన్‌కు ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమా, స్వర్ణకార సంఘ సభ్యులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేట దున్నా వారి వీధిలో కామాక్షి స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం విరాట్ విశ్వకర్మ జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, ఫ్లోర్ లీడర్ నెలిబండ్ల బాలస్వామి పాల్గొని విశ్వకర్మ భగవాన్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 31 సంవత్సరాలుగా విశ్వకర్మ జయంతి నిర్వహిస్తున్న కామాక్షి స్వర్ణకార సంఘం సభ్యులను అభినందించారు. స్వర్ణకారులకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో స్వర్ణకార సంఘం అధ్యక్షుడు బొజ్జా రవీంద్ర, ప్రధాన కార్యదర్శి హేమసుందర్, కోశాధికారి కృష్ణసాయి, వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ కుమార్, ధనాలకోట వాసు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీవారి లడ్డూప్రసాదాల విక్రయాలు

విజయవాడ కల్చరల్: టీటీడీ ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర స్వామికి ప్రీతిపాత్రమైన లడ్డూ ప్రసాదాలను పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణమండపంలో మంగళవారం విక్రయించారు. బుధవారం కూడా విక్రయాలుంటాయని టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. టెంపుల్ సూపరింటెండెంట్ మల్లికార్జున మాట్లాడుతూ ఉదయం 8.30 గంటలకు కౌంటర్ ప్రారంభిస్తామని తెలిపారు.

సీఎంఆర్ఎఫ్‌కు రూ.లక్ష అందజేత

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద బాధితుల సహాయార్థం అపోలో హాస్పిటల్, హైదరాబాద్ కన్సల్టెంట్ డాక్టర్ జయప్రకాష్ సాయి తన నెల జీతం రూ. లక్ష ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేశారు. దీనికి సంబంధించి డిజిటల్ పేమెంట్ రిసీట్‌ను టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కేశఈ కృష్ణ మూర్తికి అందజేశారు.

మహిళను మోసం చేసిన వ్యక్తిపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆర్టీసీ డిపోలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న వ్యక్తి తనను మోసం చేశాడంటూ అదే డిపోలో స్వీపర్‌గా పనిచేస్తున్న మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు...రామరాజ్యనగర్ సారంగం రోడ్డుకు చెందిన తలతోటి వెంకటరమణ విద్యాధరపురం డిపోలో స్వీపర్‌గా పనిచేస్తోంది. భర్తతో గొడవలు జరిగి వేర్వేరుగా ఉంటున్నారు. అదే డిపోలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న బి.రాజేష్ ఐదేళ్ల క్రితం ఆమెకు పరిచయం అయ్యాడు. తనతోనే కలిసి సహజీవనం చేస్తానని, వేరెవరినీ పెళ్లిచేసుకోనని చెప్పి నమ్మించాడు. అందుకు ఆమె అంగీకరించడంతో అప్పటి నుంచి ఇంటికి వచ్చి వెళుతూ ఉన్నాడు. ఈ క్రమంలో మూడేళ్ల క్రితం రాజేష్ ఆమెకు తాళి కట్టాడు. ఇదిలా ఉండగా గత నెలలో అతనికి మరో మహిళతో ఎంగేజ్‌మెంట్ జరిగింది. వెంకటరమణ విషయం తెలుసుకుని రాజేష్ తల్లికి చెప్పగా ఆమె అతనినే సమర్థించింది. రాజేష్ తనను నమ్మించి మోసం చేశాడంటూ వెంకటరమణ భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఓటీపీ మోసం

క్రెడిట్ కార్డులో రూ.96వేలు కాజేశారు!

మధురానగర్(విజయవాడసెంట్రల్):గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి ఓటీపీ అడిగితే.. ఓటీపీ చెప్పగానే క్రెడిట్ కార్డు నుంచి రూ.96వేలు డెబిట్ అయ్యాయంటూ మంగళవారం గుణదల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మధురానగర్‌కు చెందిన మరడ ప్రభ రోల్డ్ గోల్డ్ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గత రెండు సంవత్సరాల నుంచి ఎస్‌బీఐ క్రెడిట్ కార్డును వ్యాపార నిమిత్తం వాడుకుంటున్నారు. ఈనెల 15వ తేదీన గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి ఓటీపీ నంబరు అడిగారు. ఆమె ఓటీపీ నంబరు చెప్పగా కార్డు నుంచి రూ.96వేలు డెబిట్ అయ్యాయి. మోసం జరిగిందని తెలుసుకున్న ప్రభ మంగళవారం గుణదల పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకునికి గాయాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రమాదంలో గాయపడిన తన స్నేహితుడిని చూడటానికి వెళుతున్న యువకుడు రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఘటన గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కృష్ణలంకకు చెందిన దాసరి సుధీర్ స్నేహితుల వినాయక నిమజ్జనం కోసం అజిత్ సింగ్‌నగర్ వెళ్లాడు. ఇంతలో సుధీర్ స్నేహితునికి యాక్సిడెంట్ కావటంతో ప్రభుత్వ ఆసుపత్రిలో జాయిన్ చేశారని తెలిసింది. సుధీర్ గాయపడిన తన స్నేహితుని చూసేందుకు మరో స్నేహితుడితో కలిసి ద్విచక్ర వాహనంపై బయలు దేరారు. మధురానగర్ ఫుడ్ కోర్టు వద్దకు వచ్చేసరికి గుర్తు తెలియని వాహనం అడ్డు వచ్చింది. దీంతో అదుపు తప్పి పడిపోయారు. సుధీర్‌కు గాయాలయ్యాయి. సుధీర్ తల్లి దాసరి పార్వతి ఫిర్యాదు మేరకు గుణదల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.